పుణ్యకార్యం.. అన్నదానం



కాచిగూడ: ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్ లక్ష్మణ్‌రావు అన్నారు. లఖ్‌దాతర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని అన్నారు. అలాంటిది పది మందికి పంచి పెట్టడమే మహాదానమని అన్నారు. ఈ కార్యక్రమంలో సందీప్ గుప్తా, బిపిన్, హిమాన్షు, సాకేత్, నవీన్, విజయ్ గర్గర్, గౌరవ్ ఠాకూర్, రాజు, శశికాంత్, మనోజ్, అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

గురుపూజోత్సవం



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న అతిథులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: శిల్పా ఆర్ట్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా గురుపూజోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను నేషనల్ శిల్పా ఐకాన్ అవార్డులతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాంచందర్‌రావు మాట్లాడుతూ... సమాజంలో మార్పులు తేవడానికి గురువులు చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. నేటి భావిభారత పౌరులకు దిశానిర్దేశం చేస్తూ దేశాన్ని ముందుకు నడిపిస్తున్న గురువులను స్మరించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బి.దయానంద్, ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనందమోహన్, శిల్పా ఆర్ట్ క్రియేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాపర్తి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి బి.గంగాధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఆర్.పద్మప్రియ, సౌమ్య శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌ను పునరుద్ధరించాలి

హిమాయత్‌నగర్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గానికి చెందిన పెళ్లి కాని ఆడబిడ్డలకు న్యాయపరంగా అందాల్సిన కుటుంబ పెన్షన్‌ను తప్పుడు రూల్స్‌తో నీరుగార్చి వారికి పెన్షన్ రాకుండా అన్యాయానికి గురి చేసిన టీజీఎస్పీడీసీఎల్ సంస్థ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుని, ఆపిన పెన్షన్ ను వెంటనే పునరుద్ధరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.ఎం.రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బాధితులు గుడి మల్కాపూర్‌కు చెందిన సారేపల్లి మంజుల, చింతల్ బస్తీకి చెందిన భువనేశ్వరిలతో కలిసి ఆయన మాట్లాడారు. జీవో 315, 353, 122 ప్రకారం పెళ్లికాని ఆడబిడ్డలు కుటుంబ పెన్షన్లకు అర్హులన్నారు. పెన్షన్ జీఎంగా పని చేస్తున్న ఓ అధికారిణి ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం అందిస్తూ ప్రభుత్వ జీవోలు తుంగలో తొక్కి చాలా మందికి పెన్షన్ నిలిపివేసిందని ఆరోపించారు. సమావేశంలో ఎం.నర్సయ్య పాల్గొన్నారు.

అగర్వాల్ సమాజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం

గన్‌ఫౌండ్రీ: మహారాజ అగ్రసేన్ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో బాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఆదివారం ఎల్బీస్టేడియంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సమాజ్ స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ రమేష్‌కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. పురుషులు, మహిళల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్ ఉంటాయని 8 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వరకు ఉన్న క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనబోతున్నట్లు తెలిపారు. అగర్వాల్ సమాజ్ మానసరోవర్ శాఖ ద్వారా నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలకు 140 మందికి పైగా క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిల్ అగర్వాల్, టోర్నమెంట్ కన్వీనర్లు మనీష్, రాజేష్, రాహుల్ గోయల్, అవిరల్ బన్సాల్, రోహిత్‌జైన్, ముఖేష్ కుమార్ పాల్గొన్నారు.


రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి



కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని మహిళ (45) ఫలక్‌నుమా – శివరాంపల్లి రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజీ మార్గమే..రాజమార్గం..

లోక్ అదాలత్‌లో 305 కేసుల పరిష్కారం..



ఇ-పెట్టీ కేసులు 51

జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలో అత్యధిక కేసులు

బంజారాహిల్స్: సత్వర న్యాయం పొందాలంటే కక్షిదారులు కేసులను రాజీ మార్గమేలో పరిష్కరించుకోవాలని, వివాదాలను రాజీతో ముగించేందుకు లోక్ అదాలత్ వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయని గత మూడు వారాలుగా పోలీసులు అవగాహన కల్పించడమే కాకుండా అర్హత ఉన్న కేసుల విషయంలో నోటీసులు జారీ చేసి లోక్ అదాలత్‌లో రాజీ పడేందుకు ఒప్పించారు. దీంతో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. వెస్ట్‌జోన్ పరిధిలో లోక్‌అదాలత్‌కు అర్హత ఉన్న 305 కేసులు పరిష్కారానికి నోచుకున్నాయి. ఇరువర్గాలు విజ్ఞతతో ఆలోచించి తెలివైన రాజీ నిర్ణయం తీసుకుంటే మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించవచ్చని భావించిన చాలామంది లోక్‌అదాలత్‌కు మొగ్గుచూపారు.

- ◆ భార్యాభర్తల కేసుల్లో ఇద్దరూ కలిసి ఉంటే వారి సంతానంతో పాటు ఇరు కుటుంబాలు సంతోషంగా ఉంటాయని పోలీసులు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు.
- ◆ ఈ సారి ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే దిశగా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు.
- ◆ లోక్ అదాలత్‌లో కేసు పరిష్కరించుకుంటే ఇద్దరూ విజేతలేనని న్యాయమూర్తులు కూడా పేర్కొనడంతో చాలామంది ముందుకు వచ్చారు.
- ◆ సివిల్ వివాదాలు, రాజీకాగల క్రిమినల్ కేసులను పరిష్కరించుకున్నారు.
- ◆ రోడ్డు ప్రమాద నష్టపరిహార దావాల్లో పలువురు బీమా కంపెనీలతో రాజీ కుదుర్చుకున్నారు.
- ◆ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులే కాకుండా ఇంకా కోర్టు దాకా వెళ్లని ప్రీ లిటిగేషన్ దశలో ఉన్న వివాదాలను పరిష్కరించుకున్నారు.
- ◆ రోడ్డు ప్రమాదాలు, సివిల్, చీటింగ్, వివాహ, భూ తగాదా, కొట్లాటలు, బ్యాంక్ లావాదేవీలు, సైబర్ క్రైమ్, చెక్‌బౌన్స్, ట్రాఫిక్ చలానాలు, డ్రంకన్ డ్రైవ్ కేసుల పరిష్కారానికి అదాలత్ సరైన మార్గం చూపించింది.
- ◆ పరిష్కరించిన వాటికి కోర్టు ఫీజు లేకపోవడం మరో విశేషం.
- ◆ ఈ లోక్ అదాలత్‌లో వెస్ట్‌జోన్ పరిధిలో మొత్తం 305 కేసులు పరిష్కారం కాగా, ఇందులో 59 కేసులు పరిష్కరించి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత 50 కేసులు పరిష్కరించి బంజారాహిల్స్ రెండో స్థానంలో నిలిచింది.
- ◆ 51 ఇ-పెట్టీ కేసులు కూడా లోక్ అదాలత్‌లో పరిష్కరించారు. లోక్ అదాలత్‌కు అర్హత ఉన్న 578 మందికి నోటీసులు అందించగా, అందులో 305 పరిష్కారం కావడం గత లోక్ అదాలత్‌తో పోలిస్తే ఎక్కువేనని చెప్పాలి.

ఏ ఠాణా పరిధిలో ఎన్ని కేసులు..

ఠాణా పేరు	పరిష్కారమైన కేసులు
బంజారాహిల్స్	50
మాసబ్‌ట్యాంక్	31
జూబ్లీహిల్స్	59
ఫిలింనగర్	40
పంజగుట్ట	34
మధురానగర్	24
ఎస్సార్‌నగర్	38
బోరబండ	25

సమాజాన్ని చైతన్య పరిచే రచనలు చేయాలి

ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి



కృష్ణమూర్తి రచించిన 'యమునా విప్లవ కుమారులు'గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి, బైసా దేవదాసు

చిక్కడపల్లి: యువకులు సమాజాన్ని చైతన్యపరిచే రచనలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. ఆదివారం చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాలకోడేటి కృష్ణమూర్తి రచించిన 'యమునా విప్లవ కుమారులు' గ్రంథావిష్కరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత జరిగిన యువ కవి సమ్మేళనంలో కవులు, కవయిత్రులు పాల్గొని తమ స్వీయ కవితలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా వారిని కేవీ. రమణాచారి అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు బైసా దేవదాసు, మౌనశ్రీ మల్లిక్, వెంకటసుబ్బారాయుడు, చిమ్మపూడి శ్రీరామమూర్తి, రవికుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివినప్పుడే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న అధికారి శాంతి

ముషీరాబాద్: విద్యార్థులు క్రమశిక్షణతో చదివినప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ శాంతి పేర్కొన్నారు. ఆదివారం భోలక్‌పూర్‌లోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శాంతి మాట్లాడుతూ... విద్యార్థుల చదువు, ఆరోగ్య సంరక్షణతో పాటు సౌకర్యాల కల్పనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమయాన్ని వృథా చేయకుండా విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సుకన్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చేనేత ముడిసరుకులు, వస్త్రాలపై జీఎస్టీ ఎత్తివేయాలి

చేనేతవర్గాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు చిక్కాదేవదాసు



చిక్కడపల్లి: చేనేత వస్త్రాలు, ఉత్పత్తులు, ముడిసరుకులపై కేంద్రప్రభుత్వం వెంటనే జీఎస్టీని ఎత్తివేయాలని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు చిక్కాదేవదాసు కోరారు. ఆదివారం చిక్కడపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ సంస్కృతి, సంప్రదాయ వారసత్వ సంపదగా విరాజిల్లుతున్న చేనేత రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. మహిళలు ధరించే చీరలపై 18శాతం జీఎస్టీని విధించడం సరికాదన్నారు. దేశవ్యాప్తంగా కోటి ఇరవై లక్షలకు పైగా కుటుంబాలు చేనేతపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. జీఎస్టీతో జీవనోపాధి కోల్పోవడంతో పాటు నిరుద్యోగం పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ స్పందించి జీఎస్టీని ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సభ్యులు లక్ష్మి, సుమలత, గీత తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయాలి



కళాకారులతో దామోదర్‌గుప్తా తదితరులు

గన్‌ఫౌండ్రీ: చిన్నతనం నుంచే పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయాలని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా అన్నారు. ఆదివారం ఆదర్శనగర్‌లోని బిర్లా భాస్కర ఆడిటోరియంలో కూచిపూడి కళాక్షేత్రం 3వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మాగంటి వసుధ కళాక్షేత్రాన్ని స్థాపించి అనేక మంది కళాకారులను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకోగా పలువురు నాట్య గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రామ్‌దాజ్ తేజావత్, తెలుగు విశ్వ విద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ రత్నశ్రీ సుధాకర్, సునామి సుధాకర్, భారత్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు లయన్ కేవీ రమణారావు, సంస్థ వ్యవస్థాపకురాలు వసుధ పాల్గొన్నారు.

21న నమో యువ రన్

ముషీరాబాద్: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ఈనెల 21న సాయంత్రం 7గంటలకు నెక్లెస్‌రోడ్‌లో నిర్వహించే '3కే నమో యువ రన్'ను విజయవంతం చేయాలని మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్ కోరారు.ముషీరాబాద్ వాలీబాల్ హాల్‌లో బీజేవైఎం నియోజకవర్గం కన్వీనర్ గడ్డం నవీన్ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ ర్యాలీలో ముఖ్యఅతిథులుగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌లు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుషాల్‌గౌడ్, చిత్తరంజన్ గుప్తా, అనిల్‌కుమార్, ఆయుష్, సాయి, చింటూ తదితరులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

ముషీరాబాద్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎడ్ల హరిబాబు యాదవ్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్‌లోని పఠాన్‌బస్తీలో డివిజన్ బీఆర్ఎస్ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ పర్వేజ్ ఆధ్వర్యంలో ప్రాకెర్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన ఎడ్ల హరిబాబు యాదవ్ ప్రారంభించారు. డాక్టర్లు 200 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వాసీమ్, ముజీబ్, తస్నీమ్, వీర్ ఖాజాపాషా, ముషీరాబాద్ డీఐ ఎండీ నదీమ్, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ అక్తర్, ఫైజాన్, ఉస్మాయిల్, హాజీమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన నాట్య ప్రక్రియను భవిష్యత్ తరాలకు అందించాలి

గన్‌ఫౌండ్రీ: శాస్త్రీయ వారసత్వ సంపద అయిన ప్రాచీన నాట్య ప్రక్రియను భవిష్యత్ తరాలకు అందించాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో జై జవాన్ జై కిసాన్ జై కళాకార్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువందనం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగా ర్యాలీ.. మిలాద్-ఉన్-నబీ



అంబర్‌పేటలో జరిగిన మిలాద్-ఉన్-నబీ వేడుకల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్,కార్పొరేటర్ విజయ్‌కుమార్

ముషీరాబాద్: మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని భోలక్‌పూర్‌లో ఆదివారం తన్‌జీమ్ గౌసో ఖాజారజీ ఆధ్వర్యంలో భోలక్‌పూర్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ భోలక్‌పూర్ నుంచి ప్రారంభమైన ర్యాలీని పద్మశాలికాలనీ వద్దకు రాగానే బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలను సన్మానించారు. అనంతరం జైసింహ మాట్లాడుతూ... మహ్మద్ ప్రవక్త అందించిన శాంతి సందేశాన్ని అనుసరిస్తూ శాంతియుత వాతావరణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వై. శ్రీనివాస్‌రావు, బింగి నవీన్, శివముదిరాజ్, మహ్మద్ అలీ, హజీజ్ రిజ్వాన్, ఖాజీపాషా, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని శాంతియుతంగా జరుపుకోవాలి..

◆ మిలాద్-ఉన్-నబీ ర్యాలీకి సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మత పెద్దలు పోలీసులను సన్మానించారు. ర్యాలీని శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, డీఐ నదీమ్ హుస్సేన్, బీఆర్ఎస్ నాయకులు హుస్సేన్, నబీ, అజార్, నయాముద్దీన్, మక్సూద్, జహీర్, ఇబ్రహీం, సోహేల్, రహీం తదితరులు పాల్గొన్నారు.



రంగానగర్‌లో జరిగిన ర్యాలీలో మాట్లాడుతున్న ముఠా జైసింహ



భోలక్‌పూర్‌లో సెంట్రల్‌జోన్ డీసీపీ శిల్పవల్లి, ఏసీపీ రమేష్‌కుమార్, సీఐ రాంబాబు

అంబర్‌పేటలో...

◆ అంబర్‌పేట: మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఆదివారం అంబర్‌పేటలో ఘనంగా జరిగాయి. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ వేడుకల్లో మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలియజేశారు.

అమెరికామెడీ నాటికలు హాస్యభరితం



నాటక ప్రదర్శన ప్రారంభోత్సవంలో సుబ్బరాయశర్మ, వంగూరి చిట్టెన్‌రాజు

చిక్కడపల్లి: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, వంశీ కల్చరల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి త్యాగరాయ గానసభలో ప్రదర్శించిన అమెరికామెడీ నాటికలు హాస్యభరితంగా సాగి ప్రేక్షకుల మన్ననలు పొందాయి. ఈ సందర్భంగా భార్యాబాధితుల సంఘం, బామ్మాయణం, సన్యాసి ఎందుకు నచ్చారు? నాటికలను కళాకారులు ప్రేక్షాకరంజకంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రంగస్థల, సినీ నటుడు సుబ్బరాయశర్మ, ప్రముఖులు వంగూరి చిట్టెన్‌రాజు, వంశీ రామరాజు, శ్రీజ సాధినేని, రాధిక మంగిపూడి తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిజిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీరాములుకు సన్మానం



బయిగల్ల శ్రీరాములును సన్మానిస్తున్న షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి నేతలు

కవాడిగూడ: సంగారెడ్డి జిల్లా కోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బయగల్ల శ్రీరాములు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం సన్మాన కార్యక్రమం జరిగింది. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డా. బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో జరిగిన ఆల్ ఇండియా షడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు రాగాల నాగేశ్వరరావు, జాతీయ ముఖ్య ప్రధాన కార్యదర్శి నర్సింహ, రాష్ట్ర అధ్యక్షులు డి. సుదర్శన్ బాబు మాట్లాడారు. తదితరులు శ్రీరాములుకు శుభాకాంక్షలు తెలిపారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాలన్నారు. వారికి న్యాయం జరిగే విధంగా తనవంతు కృషి చేయాలన్నారు.

సాహిత్య వైభవానికి సినారె కృషి మరువలేనిది



సినారె గజల్ పురస్కార గ్రహీతలతో ఆచార్య గౌరీశంకర్, జ్ఞానకుమార్

చిక్కడపల్లి: తెలుగు సాహిత్య వైభవానికి సి.నారాయణరెడ్డి చేసిన కృషి మరువలేనిదని తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య గౌరీశంకర్ అన్నారు. ఆదివారం కొమర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో జరిగిన సినారె గజల్ పురస్కారాల మహోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కొమర్రాజు వెంకటలక్ష్మణరావు గొప్ప సాహితీ వేత్త అని కొనియాడారు. గజల్ ప్రక్రియ విశిష్టమైనదని అన్నారు. ప్రముఖులు కొమర్రాజు జ్ఞానకుమార్, గడ్డం శ్యామల, బాబాచారి, కె.కృష్ణ, శివలక్ష్మి, సుబ్రహ్మణ్యశర్మ, రఘువీర్ ప్రతాప్, లక్ష్మి, జ్యోత్స్న, ఇరువంటి శర్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమ జీవులందరూ ఐక్యం కావాలి



టీయూసీఐ సమావేశంలో మాట్లాడుతున్న సూర్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చాలీచాలని జీతాలతో బతుకీడుస్తున్న శ్రమ జీవులందరూ ఐక్యం కావాలని టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యం పిలుపునిచ్చారు. ఆదివారం మార్క్స్ భవన్‌లో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం పార్టీ జెండాను నగర అధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ ఎగరవేశారు. అనంతరం జరిగిన సమావేశంలో సూర్యం మాట్లాడుతూ... ఉద్యోగ భద్రత , సామాజిక భద్రత, కనీస వేతనం అమలు చేయకుండా పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. 8గంటల పని దినాన్ని తుంగలో తొక్కి 14 గంటలు పెంచాలని చట్టం చేస్తున్నారని విమర్శించారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగినా కార్మికుల సమస్యలు తగ్గడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. హన్మేష్, వి. ప్రవీణ్, లింగం గౌడ్, ఎస్. శ్రీనివాస్,కెఎస్.ప్రదీప్, డి. లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్త్రాలను ఆదరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దీపికా దినేష్, శ్రీనివాసరావు

శ్రీనగర్‌కాలనీ: స్వదేశీ వస్త్రాలను ఆదరించాలని, మహిళల వస్త్ర వైభవానికి పట్టుచీర ప్రతీక అని ఇండియన్ సిల్క్ గ్యాలరీ బ్రాండ్ అంబాసిడర్ దీపికా దినేష్ అన్నారు. ఆదివారం శ్రీనగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈనెల 16 నుంచి 23 వరకు కేంద్ర చేనేత, జౌళి శాఖ సహకారంతో శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట నిర్వహిస్తున్న సిల్క్ ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. భారతీయ కళాత్మక నైపుణ్యానికి, నాణ్యమైన పట్టువస్త్రాలకు వేదికగా ఇండియన్ సిల్క్ గ్యాలరీ నిలుస్తుందన్నారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో అద్భుత శైలిగల పట్టు వస్త్రాలు లభిస్తామని, దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని దేశంలో ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు ఆయా ప్రాంతాల పట్టు వస్త్రాలను ఈ ప్రదర్శనలో ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్‌కుమార్ తెలిపారు.